విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఇన్‌స్పెక్టర్ నాగరాజు

కేంద్రీయ విద్యాలయలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు

బొల్లారం, ఆగస్టు 17: శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు విద్యార్థులకు సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. శనివారం తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయలో డ్రగ్స్, సైబర్ నేరాలు, సెన్సిటైజేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడితే జీవితాలు నాశనమవుతాయని, చెడు అలవాట్లకు గురికాకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరుతెచ్చి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

సికింద్రాబాద్, ఆగస్టు 17: సీతాఫల్‌మండిలోని ఎస్ఎల్ వృద్ధాశ్రమంలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా మీడియా జాయింట్ కోఆర్డినేటర్ తల్లి కుసుమ కుమారి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాధారి రామ్మోహన్ ముదిరాజ్ హాజరై కుసుమ కుమారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణకుమార్‌గౌడ్, ఎండీఎఫ్ తెలంగాణ ఉపాధ్యక్షుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- 'గాంధీ'లో నల్ల బ్యాడ్జిలతో వైద్యుల నిరసన
- పలు ప్రాంతాల్లో ర్యాలీలు, నిరసనలో సిబ్బంది

గాంధీ దవాఖానలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 17: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి, హత్య సంఘటనను నిరసిస్తూ శనివారం గాంధీ దవాఖానలో జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించి, నిరసన చేపట్టారు. అనంతరం ఇందిరాపార్క్ వద్ద జరిగిన భారీ ధర్నాలో పాల్గొన్నారు. ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం, గాంధీ యూనిట్ ప్రతినిధులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు.

'గాంధీ' ఓపీలో తగ్గిన రద్దీ..

గాంధీ దవాఖానలో బయటి రోగుల విభాగంలో జనం రద్దీ కనిపించలేదు. సాధారణంగానే శనివారం నమోదు తక్కువ ఉంటుంది. దీనికితోడు దేశవ్యాప్తంగా వైద్యుల సమ్మె గురించి ప్రచారం కావడంతో ఓపీ కౌంటర్ల వద్ద రోగుల హాజరు తగ్గింది. సీనియర్ వైద్యులు నిరసన తర్వాత విధులకు హాజరయ్యారు.

వైద్య సేవలు యథాతథం: సూపరింటెండెంట్

దేశవ్యాప్త సమ్మె కారణంగా గాంధీలో సాధారణ వైద్యసేవలు యథాతథంగా కొనసాగాయని సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి తెలిపారు. ఐసీయూ, అత్యవసర వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు, ప్రసూతి విభాగం, ఓపీ సేవల్లో రోగులకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో..

బోయిగూడలోని సికింద్రాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విద్యుల్లత, అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో..

అమీర్‌పేట్: అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు స్తంభించాయి. ఆర్ఎంవో డాక్టర్ వినాయక్ ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు, చేతిలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు.

దంత వైద్యుల సంఘం ఆధ్వర్యంలో..

మారేడ్‌పల్లి: నిందితుడికి ఉరిశిక్ష విధించాలని సికింద్రాబాద్ దంత వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో పరేడ్ మైదానం మెట్రో స్టేషన్ నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్డీఏ అధ్యక్షుడు, డాక్టర్ అబేద్‌అలీ, కార్యదర్శి గట్టు సుభాష్, డాక్టర్స్ పవన్ మహాత్మ, దినేశ్ నమిలే, నూతన్ పోతులు, ప్రేమ్ కుంజు, చైతన్య, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ మారేడ్‌పల్లిలోని గీతా మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాంచంద్రారెడ్డి, డాక్టర్ కృష్ణరెడ్డి, ఆసుపత్రి ఇన్‌చార్జి మేఘనారెడ్డి బంద్‌కు మద్దతు తెలిపారు. అలాగే యశోద ఆసుపత్రి బంద్‌కు పూర్తి మద్దతును ప్రకటించింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

నిందితులను ఉరితీయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీతేజ ఆధ్వర్యంలో ఓయూలో ర్యాలీ నిర్వహించారు. ఘటనకు పాల్పడిన నిందితులను తక్షణమే ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, కమల్ సురేశ్, సుమన్, శంకర్, రాజు, వికాస్, శివశంకర్, రాజశేఖర్, నితీశ్, సాయి, సంఘవి, శివ, రాణి, అమృత, స్వాతి, అర్చన పాల్గొన్నారు.

వైద్యుల నిరసనతో నిర్మానుష్యంగా మారిన గాంధీ దవాఖాన ప్రాంగణం

మారేడ్‌పల్లిలోని గీతా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద నిరసనలో ఎండీ డాక్టర్ రాంచంద్రారెడ్డి, మేఘనారెడ్డి

సికింద్రాబాద్ యశోద ఆవరణలో ఓపీ సేవలను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిరసనలో వైద్యులు

ఘనంగా రామేశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న యువనేత రామేశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్, ఆగస్టు 17: సికింద్రాబాద్ బీఆర్ఎస్ యువనేత తీగుల్ల రామేశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం సికింద్రాబాద్‌లో ఘనంగా జరిగాయి. సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ కుటుంబ సభ్యులు, వందలాది మంది కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో రామేశ్వర్‌గౌడ్ తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మెట్టుగూడలోని దూద్‌బావి ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రిని రామేశ్వర్‌గౌడ్ పంపిణీ చేశారు. అదేవిధంగా వివిధ సేవ కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

సికింద్రాబాద్, ఆగస్టు 17: పేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం దాగి ఉందని సికింద్రాబాద్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పొద్దుటూరి వెంకటేశ్వర్ రావు (బాబు) అన్నారు. శనివారం సీతాఫల్‌మండిలోని పలు స్కూల్లలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను అందజేశారు. సేవ చేయడానికి ముందుకు వచ్చిన దాతలు అక్షర, సహస్రను సంఘ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో పోకల రాజనర్సింహ, కార్యదర్శి ప్రభాకర్, ట్రెజరర్ పూరం రమేశ్, డెంటల్ డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం జరగాలి

ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న సమితి చైర్మన్ ఎస్.యాదగిరి, ప్రతినిధులు

అడ్డగుట్ట, ఆగస్టు 17: తెలంగాణ కోసం కోట్లాడిన ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, కళాకారులకు న్యాయం జరుగాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ ఎస్.యాదగిరి ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు కోదండరాంను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పోరాటం చేసిన వారికి సంపూర్ణ న్యాయం జరగాలని విన్నవించారు. ఉద్యమకారుల పోరాటం, అమరుల త్యాగాలకు, కళాకారుల కష్టాలకు గుర్తింపును ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు తుమ్మల ప్రపూర్ణ రాంరెడ్డి, రంగారెడ్డి, కొండస్వామి, యాదగిరి, అమ్ములు యాదగిరి, సుజాత, అరుణ, స్వరూప రాణి, వెంకటస్వామి, హన్మంత్, సునిత, శంకర్రావు, సంతోష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయానికి విరాళం

ఎమ్మెల్యే పద్మారావు సమక్షంలో ఆలయ చైర్మన్‌కు చెక్కును అందజేస్తున్న బాబురావు

సికింద్రాబాద్, ఆగస్టు 17: లష్కర్ జిల్లా సాధన సమితి ఉపాధ్యక్షుడు మిట్టపల్లి బాబురావు బంగారు మైసమ్మ గుడికి రూ.1లక్షా 50వేల విరాళం అందించారు. అక్టోబర్‌లో జరగనున్న నవరాత్రి ఉత్సవాల కోసం మధురానగర్‌కాలనీలో ఉన్న ఆలయానికి విరాళాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మరావుగౌడ్ సమక్షంలో ఆలయ చైర్మన్‌కు అందజేశారు. మిట్టపల్లి బాబురావును ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

విద్యార్థులకు బహుమతులను అందజేసిన సంజన, శ్రావణి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 17: బోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించారు. విజేతలకు రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ అధ్యక్షురాలు పి.సంజన, కార్యదర్శి పి.శ్రావణి బహుమతులను అందజేసి అభినందనలు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని వారు విద్యార్థులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆటల పోటీలు నిర్వహించి, తమ పాఠశాలలోని విద్యార్థులను ప్రోత్సహిస్తున్న దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి

దూద్‌బావిలో ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, ఆగస్టు 17: ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి చేస్తున్నామని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతరమేశ్ అన్నారు. శనివారం దూద్‌బావిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. బస్తీలవారీగా ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవుతూ సమస్యలకు శాశ్వత పరిష్కరాలను చూపిస్తున్నామని ఆమె అన్నారు.

నిధులు మంజూరు.. అభినందనలు

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్యాంసన్ రాజ్

బొల్లారం, ఆగస్టు 17: కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.5కోట్ల 49లక్షల ప్రత్యేక నిధులు ప్రభుత్వం మంజూరు చేయడానికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ విశేషంగా కృషి చేశారని రెండో వార్డు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్యాంసన్ రాజ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు యాదగిరి, నాగరాజు, మురళి, అశ్రఫ్, నగేశ్, రమేశ్, గౌస్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ నిధులు తీసుకురావడం హర్షణీయమని ఏడో వార్డు లాల్ బజార్ మహంకాళి దేవాలయ కమిటీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు మురళీ ముదిరాజ్ అన్నారు. ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్యేను అభినందిస్తున్న మురళీ ముదిరాజ్

డిమాండ్లు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 17: రాష్ట్రంలోని వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సేవలను పదవీ విరమణ వయసు 60 ఏండ్లతో సంబంధం లేకుండా కొనసాగించవచ్చని ఉన్నత విద్యామండలి జారీ చేసిన ఉత్తర్వులపై యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ తెలంగాణ స్టేట్ (యూటీఏసీటీఎస్) హర్షం వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఉత్తర్వులు ఎంతో ఆసరా, భరోసాను కల్పిస్తున్నాయని పేర్కొంది. యూటీఏసీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎ.పరశురాం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే పెద్ద మనసుతో తమ ఇతర డిమాండ్లూ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్, ఆగస్టు 17: ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలకు తెలంగాణ ప్రభుత్వ హయాంలో శాశ్వత పరిష్కారం చూపామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం బేగంపేట్ డివిజన్ బ్రాహ్మణవాడి పోస్ట్ ఆఫీస్ వద్ద జయంత్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. సీవరేజీ లైన్ లేకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సమస్య పరిష్కారానికి కొత్త సీవరేజీ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కాలనీలో అవసరమైన చోట రోడ్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతేగాకుండా తరచుగా సీవరేజీ లీకేజీ వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. ఎయిర్‌టెక్ మిషన్లు ఉపయోగించి మ్యాన్‌హోల్స్‌ను క్లీనింగ్ చేయాలని, తద్వారా లీకేజీని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.45కోట్లతో నాలా పూడికతీత, బస్తీల్లో సీవరేజీ లైన్లు, రోడ్లు అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జల మండలి డీజీఎం అశీష్, ఏఈ వెంకట్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రావు, శేఖర్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు పరామర్శ..

బేగంపేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అక్బర్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. ఇటీవల అక్బర్ ఆయన సతీమణి రఖియాబేగం అనారోగ్యానికి గురైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్బర్ నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ అఖిల్ హమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగిస్తే జీవితాలు గల్లంతే

అమీర్‌పేట్, ఆగస్టు 17: డ్రగ్స్ వల్ల జీవితాలు గల్లంతవుతున్న తీరు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు అన్నారు. సనత్‌నగర్ గ్రంథాలయంలో పలు అంశాలపై 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాస రచనతో పాటు జనరల్ నాలెడ్జ్‌లో పోటీలు జరిగాయి. విజేతలకు శనివారం మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కొండల్‌రావు బహుమతులు అందజేశారు. ఆసరా కమిటీ ఖైరతాబాద్ సర్కిల్ ఉపాధ్యక్షుడు జేఎస్టీ శాయి, యూసీడీ పీవో శ్రీనివాస్, ఎస్ఆర్‌నగర్ ఎస్సై అఖిల, ఎస్ఆర్‌నగర్ లైబ్రేరియన్ హరిబాబు, వయోధిక సంఘాల ప్రతినిధులు అనంతరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాద్, రాజేందర్, ప్రతినిధులు నాగమణి, రాజేశ్వరి, చంద్రశేఖర్, దశరథ్‌రెడ్డి, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

జోషి కాంపౌండ్‌లో కాలనీవాసులతో సమావేశమైన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఆగస్టు 17: జోషి కాంపౌండ్‌లో నెలకొన్న సమస్యలను అధికారులతో కలిసి పరిష్కరిస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని జోషి కాంపౌండ్‌లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు గుర్తించి అధికారుల సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. ఒకచోట సీవరేజీ పైప్ లైన్ బ్లాక్ అయ్యిందని, ఆ సమస్య పరిష్కారం అయిన తర్వాత నూతన సీసీరోడ్డు పనులు మొదలు పెడతామని కార్పొరేటర్ స్థానికులకు హామీ ఇచ్చారు. రూ.33లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు, రూ.35లక్షలతో సీవరేజీ లైన్ పనులు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజాసుందర్, సుభాష్, స్థానికులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రులు ప్రశాంత నిర్వహించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

సికింద్రాబాద్, ఆగస్టు 17: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈస్ట్ జోన్ చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి సూచించారు. శనివారం రాత్రి చిలకలగూడ డివిజన్ గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలన్నారు. గణేశ్ మండప నిర్వాహకులు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో అనుమతులు పొందాలన్నారు. అనుమతులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని చెప్పారు. మండపాల వద్ద రాత్రి, పగలు నిర్వాహకులు తప్పకుండా ఉండాలన్నారు. అన్ని మండపాల వద్ద అన్ని శాఖల అధికారుల సెల్ నంబర్లు ఉండాలని పేర్కొన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 100కు డయల్ చేయాలన్నారు. మండపాల వద్ద విధులు నిర్వహించే పోలీసులను నిర్వాహకులు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, కరుణాకర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, ఎస్సైలు సుధాకర్, బాలరాజు, షాహిద్, కరుణాకర్ రెడ్డి, సబిత, ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలి

ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

మారేడ్‌పల్లి, ఆగస్టు 17: విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ జూనియర్ బాలికల కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు శనివారం కళాశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన నియోజకవర్గంలో కళాశాల ఉండడం గర్వపడుతున్నానని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషితో 50 ఏండ్ల ఉత్సవాలు జరుగడం సంతోషకరమని తెలిపారు. ఎంతో మంది విద్యార్థినులు ఆయా రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ చాలా అవసరమని పేర్కొన్నారు. కష్టపడితేనే భవిష్యత్‌లో మంచి స్థానంలో ఉంటారని, అందుకు నేనే ఉదాహరణ అని తెలిపారు. అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎమ్మెల్యే జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కె.రమాదేవి, సెక్రటరీ బీపీ చక్రవర్తి, ట్రెజరర్ వినయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ జనార్దన్, సభ్యులు గంగాధర్‌రావు, సత్యేందర్ వనం, హనుమంతరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ చారుమతిదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ప్లేస్‌మెంట్స్ డ్రైవ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 17: ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో బుధవారం ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎఫ్ఆర్‌డీ) భవనంలోని ఈ-క్లాస్ రూంలో నిర్వహించిన కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగానికి చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులకు హెటెరో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పలు పరీక్షలు నిర్వహించారు. హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజని, కోఆర్డినేటర్ మురళీధర్‌రెడ్డి, సీఎఫ్ఆర్‌డీ డైరెక్టర్ సందీప్త, సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయశ్రీ, హెటెరో డ్రగ్స్ ఏజీఎం సుబ్రహ్మణ్యం, హెచ్ఆర్ విభాగం అధిపతి మాధురి తదితరులు పాల్గొన్నారు.